క్లుప్తంగా

డ్రిప్ పద్ధతితో అధిక ప్రయోజనం



డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారిణి ఇందిర

ఆలూరు: ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేసిన డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని హార్టికల్చర్ అధికారిణి ఇందిర సూచించారు. ఆమె సోమవారం ఆలూరు, హాలహర్వి, ఆస్పరి మండలాల్లో రైతులు డ్రిప్ ఇరిగేషన్ సామగ్రి వినియోగించుకునే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రిప్ సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, తీగ పంటలను సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించవచ్చని వివరించారు. పంటల సాగుపై గ్రామాల్లో రైతులకు ఆర్‌బీకే సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విజి'లెన్స్'



కొటేకల్‌లో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి, కోటేకల్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్రాల నుంచి వచ్చే పౌష్టికాహారం సక్రమంగా బాలింత లు, గర్భిణులకు, పిల్లలకు అందుతుందా లేదా అని తనిఖీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే పౌష్టికాహారం, కోడిగుడ్లు సక్రమంగా అందించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్ ఏఈ శ్రీనివాసులు వెంట ఉన్నారు.

తెలంగాణ ఎస్‌ఐగా గువ్వలకుంట్ల వాసి



బండారు ఎల్లకృష్ణ

వెల్దుర్తి: మండల పరిధిలోని బోగోలు పంచాయతీ మజారా గ్రామం గువ్వలకుంట్ల యువకుడు బండారు ఎల్లకృష్ణ ఈనెల 6న తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన ఎస్‌ఐ పోస్టుల జాబితాలో ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన రైతు బాలన్న, సులోచన దంపతుల కుమారుడు ఎల్లకృష్ణ తిరుపతి యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. ఇటీవల ఆర్‌ఆర్‌బీ పరీక్షల్లో ఉత్తీర్ణుడై ఉద్యోగ నిర్వహణలో ఉన్నాడు. 2022 డిసెంబర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షల ఫలితాలు ఈ నెల 6న విడుదల కాగా 260/400 మార్కులు సాధించి నాన్‌లోకల్ విభాగం ఓపెన్ కేటగిరీలో ఛార్మినార్ జోన్–6లో సివిల్ ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. కుమారుడి ఎంపిక పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి

హాలహర్వి: పాడిరైతులు పశుపోషణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి అశోక్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక పశు వైద్యశాలలో మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామాల్లోని పాడి రైతులకు పశువులు, గొర్రెలు, మేకలకు రోగనిరోధక శక్తిని పెంచే మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. పశువులకు జ్వరం, ఆయాసం వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం అందించే గ్రాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థినులతో ట్రస్ట్ ప్రతినిధులు

ఎమ్మిగనూరుటౌన్: పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో పలు ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను ట్రస్ట్ చైర్మన్ రఘునాథ్, తారకేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా చేపడుతున్న సేవాకార్యక్రమాల్లో భాగంగా ప్రస్తుతం 2 వేల మంది విద్యార్థినులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుర్ని దైవాచార సంఘ నాయకులు సుధాకర్, నాగరాజు, బుట్టాఈరన్న, చంద్రశేఖర్, రాము, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సాధికారత.. సంక్షేమ బాట

- డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ వరాలు
- స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ వర్తింపు
- ఈనెల 10న మరో విడత వడ్డీ సొమ్ము విడుదల
- నియోజకవర్గంలో 5,339 గ్రూపులు
- 57,056 మందికి రూ. 6.45 కోట్ల మేర లబ్ధి

లబ్ధిదారులు ఇలా..

మండలం	సంఘాలు	సభ్యులు	మొత్తం లబ్ధి (రూ.కోట్లలో)
తుగ్గలి	1,131	12,356	1.23
పత్తికొండ	1,177	11870	1.31
మద్దికెర	755	8,220	1.12
వెల్దుర్తి	1,367	13,760	1.67
కృష్ణగిరి	909	10,850	1.11



పొదుపు మహిళల సమావేశం (ఫైల్)

తుగ్గలి: మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంభనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మహిళల ఆర్థిక పరిపుష్టి,స్వయం ఉపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ఈ దిశగా స్వయం సంఘాల (డ్వాక్రా) మహిళలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తున్నారు. వీటితో మహిళల ఉపాధికి బాటలు వేస్తున్నారు. ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతోనూ ఆర్థికంగా ఆదుకుంటున్నారు. దీంతో పాటు డ్వాక్రా రుణాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా సున్నా వడ్డీ నిధులను మహిళ ఖాతాలకు జమ చేయగా.. నాలుగో విడత వడ్డీ రాయితీ నిధులను ఈనెల 10న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేయనున్నారు.

సున్నా వడ్డీ పథకం వర్తింపు ఇలా..

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాలు వాటిని సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్న సంఘాలకు వైఎస్సార్ వడ్డీ వర్తిస్తుంది. సంఘాలు తీసుకున్న అప్పు తేదీ, అప్పు మొత్తం, పొదుపు ఖాతాల నంబర్లు, బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తదితర వివరాలను మండల స్థాయిలో అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

మాట తప్పని నేత సీఎం జగన్



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రుణ మాఫీతో పొదుపు మహిళలను మోసం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పొదుపు రుణాలు మాఫీ చేశారు. మూడు విడతల మాఫీ సొమ్ము సభ్యుల ఖాతాలకు జమ చేశారు. సున్నా వడ్డీ రాయితీ కూడా జమ చేస్తున్నారు. తండ్రి వైఎస్సార్ పావలా వడ్డీ రుణాలు ఇస్తే తనయుడు జగన్ సున్నా వడ్డీ రుణాలు ఇస్తున్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి జగనన్న ఎన్నో పథకాలు అమలు చేసి మహిళా పక్షపాతిగా నిలిచారు.

– అనుంరాజు ఆదెమ్మ, ఎంపీపీ, తుగ్గలి

ప్రభుత్వ తోడ్పాటు బాగుంది



పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం చాలా బాగుంది. బ్యాంకు రుణం, స్త్రీనిధి కింద మొత్తం రూ.1.50 లక్షలు రుణం తీసుకొని అంగడి పెట్టుకున్నా. రోజూ కూలిపాటు వస్తుంది. ఆసరా కింద రూ.11,500 వచ్చింది. జగనన్న తోడు కింద రూ.10 వేలు తీసుకున్నా. వీటితో పాటు అమ్మ ఒడి, సున్నా వడ్డీ పథకాలతో ఇబ్బందుల నుంచి బయటపడుతున్నాం. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న పొదుపు రుణాలు మాఫీ చేసి మాట నిలబెట్టుకున్నారు. అన్ని రకాలుగా ఆదుకుంటున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– తిరుపాలమ్మ, పొదుపు సంఘం సభ్యురాలు, ప్రతిభ గ్రూపు, జొన్నగిరి తండ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి. స్వయం ఉపాధి యూనిట్లు, చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని మహిళా పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలి. ఈనెల 10న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి సున్నా వడ్డీ రాయితీ నిధులు ఖాతాలకు జమ చేయనున్నారు.

– రాధాకృష్ణ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, తుగ్గలి

పొలంబడితో రైతులకు మేలు



కలుగొట్లలో మిశ్రమ పంటల సాగు విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వెల్దుర్తి: పొలం బడి కార్యక్రమం ద్వారా రైతులు ఒకరి అనుభవాలు మరొకరు పంచుకోవడం, అధికారుల సూచనలు, జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవడం ద్వారా మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి మాబువలి అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుక్కాపురం యూనిట్ కలుగొట్ల గ్రామంలో కురువ పరమేశ్వరుడు సాగుచేసిన పత్తి పంటలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులలో పంటలకు ఆశించు తెగుళ్లు, వాటి నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి చెందిన డీలర్ కురువ ప్రభాకర్ తన రెండెకరాలలో సాగు చేసిన మొక్కజొన్న పంటలో అంతర్ పంటలుగా 20 రకాల విత్తనాలతో (కంది, మినుములు, సోయాబీన్, జొన్న, సజ్జ, రాగులు, పెసలు, పలు కూరగాయ రకాలు) మిశ్రమ పంటను వేయించారు. మొక్కజొన్న పైరును పరిశీలించి ద్రవజీవామృతం అవసరాన్ని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రతినిధులు శ్రవణ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రాఘవేంద్ర, రామకృష్ణారెడ్డి, పరమేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక డంపింగ్



నాగరకణ్వీ సమీపంలో ఇసుకను డంప్ చేసిన దృశ్యం

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని నాగరకణ్వీ గ్రామం వద్ద వేదావతి (హగరి) నది నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలించి డంప్ చేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన కొందరు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి నది నుంచి ఇసుకను తరలించి రెండు, మూడు చోట్ల నిల్వ ఉంచారు. నదికి వరద వస్తే ఇసుకకు డిమాండ్ పెరుగుతుంది. ఆ సమయంలో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో ఇసుకను డంప్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నది నుంచి హొళగుందకు ట్రాక్టర్ ఇసుక రూ.2,500 వరకు ఉంది. వర్షాకాలంలో డిమాండ్ పెరగనుండడంతో ట్రిప్పు రూ.4 వేల వరకు అమ్ముకునే అవకాశాలు ఉంటాయి. ఆదోని, ఆలూరు, ఇతర పట్టణాలకు అయితే ధర భారీగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. అక్రమంగా ఇసుకను తరలించి డంప్ చేసే వారిపై చర్యలు తీసుకుని భూగర్భ జలాలు అడుగంటకుండా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌ను వివరణ కోరగా నది పక్కన కొందరు ఇసుకను నిల్వ చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, పోలీసుల సహకారంతో తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దుర్గమ్మ సేవలో మంత్రి



మంత్రి జయరాంకు ప్రసాదాలు అందజేస్తున్న పాలక మండలి సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు.అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, కేసరి నాగమణి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందచేశారు.

మిషన్ ఇంద్రధనస్సు చిన్నారులకు వరం



మద్దికెరలో శిశువుకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర: పిల్లలు భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా విడతల వారీగా టీకాలు వేసేలా ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం చిన్నారులకు వరం లాంటిదని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ అన్నారు. సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా ఈనెల 7వతేదీ నుంచి 12వ తేదీ వరకు, అలాగే సెప్టెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు, రెండో విడత అక్టోబర్ 9 నుంచి 14వతేదీ వరకు టీకాలు వేస్తారని వివరించారు. ఆయా గ్రామాలలో సచివాలయాలు, హెల్త్ సెంటర్లలో టీకాలు వేస్తారని, సకాలంలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో జరుగుతున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని హెల్త్ సూపర్‌వైజర్ హనుమంతమ్మ సోమవారం పరిశీలించారు. వివిధ కారణాల రీత్యా టీకాలకు దూరమైన పిల్లలను వెతికి వారికి భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా టీకాలు వేయించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఏఎన్ఎం నాగవేణి, ఆశావర్కర్ హైమావతి, అంగన్‌వాడీ టీచర్ ఆశాబి పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి

వెల్దుర్తి: మే నెలలో, ఆ తర్వాత బోర్ల కింద సాగుచేసిన మిరప పైరు ఎదుగుదల లేక నష్టపోయామని, తమను ఆదుకోవాలని కోరుతూ రామళ్లకోట రైతులు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేశ్‌తో కలిసి వెళ్లి సోమవారం కర్నూలు స్పందనలో కలెక్టర్ సృజనకు విన్నవించారు. గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామ రైతులు వేలాది ఎకరాల్లో పంట నష్టపోయారని వాపోయారు. అంతకుముందు జిల్లా పరిషత్ హాలు ముందు నిరసన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కౌడి పీర్ల ఉత్సవాలు



హాలహర్వి కౌడు పీర్ల దేవుళ్లను ఏటికి తరలిస్తున్న నిర్వాహకులు



కోయనగర్ కాలనీలో కొలువైన కౌడీ పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు అందిస్తున్న భక్తులు

ఆలూరు రూరల్/హాలహర్వి: నియోజకవర్గ వ్యాప్తంగా కౌడి పీర్ల ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. సోమవారం ఆయా పీర్ల చావిడిల వద్ద పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి భక్తులు చెక్కర తులాభారం, గుడ్డలు, పూలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తమ ఇళ్ల ముందు ఊరేగింపుగా వెళ్తున్న దేవుళ్లకు పూజలు నిర్వహించారు. రాత్రి అగ్ని గుండం కాల్చారు. నేడు సాయంత్రం పీర్లు జలధికి వెళ్లడంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

హామీలు నెరవేర్చడంలో కేంద్రం విఫలం

ఆస్పరి: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. సోమవారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో సీపీఐ ఆలూరు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికుల హక్కులను హరించే రీతిలో మూడు వినాశక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు నియోజకవర్గం సస్యశ్యామలం కావాలంటే 8 టీఎంసీల సామర్థ్యంతో వేదావతి ప్రాజెక్టును నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆస్పరి మండలానికి సాగు, తాగు నీరు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 9, 10వ తేదీలలో ఆస్పరిలో నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. సీపీఐ నాయకులు మద్దిలేటి శెట్టి, విరుపాక్షి, శివ, కాలప్ప, రాజశేఖర్, కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, అంజినయ్య పాల్గొన్నారు.

మణిపూర్ హింసాత్మక ఘటనలపై నిరసన



వెల్దుర్తి పాతబస్టాండు వద్ద ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

వెల్దుర్తి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, హింసాత్మక ఘటనలను నిరసిస్తూ స్థానిక క్రైస్తవ, దళిత సంఘాలు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మణిపూర్‌లో హింసపై పీఎం మోదీ నోరు తెరవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరినీ సమానంగా చూడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినదిస్తూ, భరతమాత జెండా చేతబూని స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీ ప్రారంభించారు. పాతబస్టాండు చేరుకుని అంబేడ్కర్‌కు పూలమాల వేసి నివాళి అర్పించి, మానవహారం చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. బైఠాయించారు. అనంతరం తహసీల్దార్ శివరాముడుకు తమ వినతిపత్రం సమర్పించారు. క్రైస్తవ గృహాలపై దహనకాండ, దాడులు ఆపాలని, స్త్రీల గౌరవం కాపాడాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, అగస్టీన్, ప్రశాంత్ బాబు, ఏసేపు, దేవసుందరం, బాలచిన్నయ్య, శంకిరాజు, తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన టమాట.. కరుణించిన మిరప



పచ్చిమిర్చి, టమాట కొనుగోలు చేస్తున్న దృశ్యం

మద్దికెర: గత నెలరోజులుగా టమాట, పచ్చి మిర్చి ధరలు కేజీ రూ.వంద నుంచి రూ.150 వరకు పలకడంతో బేంబేలెత్తిన జనాలు సోమవారం ఊరటచెందారు. మద్దికెరలో బస్టాండు వద్ద టమాట, పచ్చి మిర్చి కిలో రూ.50కు విక్రయిస్తుండడంతో జనాలు ఎగబడి కొనుగోలు చేశారు. తక్కువ ధరకు మళ్లీ దొరుకుతాయో లేదోనని అటువైపు వెళుతున్న కూలీలు, వ్యాపారులు, అధికారులు సైతం కొనుగోలు చేశారు.

ఆటో–ట్రాక్టర్ ఢీ: నలుగురికి గాయాలు

పత్తికొండ టౌన్: స్థానిక పాతపేట వడ్డెకట్ట వద్ద సోమవారం రాత్రి ఆటో–ట్రాక్టర్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటోడ్రైవర్ మురళితో పాటు, మరో ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పత్తికొండ పట్టణం చక్రాళ్ల రోడ్డు ఫక్కుమియా దర్గా సమీపంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ మురళి తన ఆటోలో ప్రయాణికులకు ఎక్కించుకుని వస్తుండగా, వడ్డేకట్ట సమీపంలో చందోలి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయింది. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

నందవరం: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మండలంలో ఖాళీ ఏర్పడిన స్థానాలకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని హలహార్వి గ్రామ పంచాయతీలో 7వ వార్డు మెంబర్ స్థానం ఖాళీగా ఉందని, ఆ స్థానానికి ఎస్సీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్లకు 10వ తేదీ ఆఖరు అని, 19న ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల ఆర్వోగా ఎంఈఓ–2 రఘునాథ్‌ను నియమించినట్లు వెల్లడించారు.

లంపీస్కిన్ వ్యాధి నివారణకు టీకాలు

హొళగుంద: మండల పరిధిలోని చిన్నహ్యోట గ్రామంలో సోమవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థ ఆధ్వర్యంలో విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ జిలాన్ పశువులకు లంపీస్కిన్ (ముద్ద చర్మం) వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంపీస్కిన్ వ్యాధి సోకిన పశువులు పాలివ్వవని, తీవ్ర అస్వస్థతకు గురవుతాయన్నారు. పుండ్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడతాయన్నారు. వ్యాధి గురించి సందేహాలుంటే పశు వైద్యులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలన్నారు. సంస్థ ప్రతినిధి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

మద్దికెర: మండల కేంద్రంలోని 16వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఎంపీపీ అనిత, సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చేనేత కార్మికుడు జేరుబండి ఆంజినేయులు అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం స్థానిక పద్మశాలి బహుత్తమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్ రమేష్, వీరప్రసాద్, దోమ భీమేష్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

త్వరలో నూతన గెస్ట్‌హౌస్ పనులు

ఆలూరు: రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో ఆలూరులో రూ 3.50 కోట్లతో గెస్ట్‌హౌస్ భవన నిర్మాణం ప్రారంభించనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ అనీఫ్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరడంతో కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. నూతన గెస్ట్ హౌస్ సకల హంగులతో నిర్మిస్తామని, ప్రహరీ, వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరంకు చెందిన రేవతి సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆమెను పుట్టింటికి పంపేందుకు భర్త నిరాకరించడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఎనామిల్ పెయింట్ తాగింది. హుటాహుటిన వెల్దుర్తి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రస్తా విషయంలో ఘర్షణ

తుగ్గలి: మండల పరిధిలోని కోతికొండ గ్రామంలో పొలం రస్తా విషయమై జరిగిన గొడవలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన డీలర్ అయ్యన్న పొలం రస్తా విషయంలో కలగజేసుకుంటుండడంతో, అదే గ్రామానికి చెందిన వెంకటేష్‌తో ఆదివారం రాత్రి గొడవ ఏర్పడింది. ఘర్షణలో అయ్యన్నకు గాయాలయ్యాయి. ఘటనపై ఫిర్యాదు అందలేదని తుగ్గలి పోలీసులు తెలిపారు.

విద్యార్థికి అభినందన

ఆస్పరి: స్థానిక విజేత ప్రైవేట్ స్కూల్లో 10వ తరగతి చదివిన ఆస్పరికి చెందిన ఆర్‌పీ జితేంద్రసింగ్ 586 మార్కులు సాధించడంతో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు పొందారు. ఈ సందర్భంగా సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో విద్యార్థి ఆర్‌పీ జితేంద్రసింగ్‌ను తహసీల్దార్ కుమారస్వామి, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, డీటీ గాయత్రీ, ఈఓఆర్డీ సూర్య నరసింహారెడ్డి, తదితరులు అభినందించారు. బాగా చదివి ఆస్పరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

త్వరలో డ్రోన్ సర్వే

కృష్ణగిరి: మండల పరిధిలోని లక్కసాగరం, పోతుగల్లు గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో త్వరలో రీసర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి సోమవారం తెలిపారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే సర్వేకు సంబంధించి ఫీల్డ్ పనులు పూర్తి చేశామని, డ్రోన్ సర్వే త్వరలో ప్రారంభమవుతుందని వీఆర్వోలు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అలాగే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను విచారించి నివేదిక ఇవ్వాలని వీఆర్వోలను ఆదేశించారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో జగనన్న కాలనీని ఈనెల 20వ తేదీన ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం హౌసింగ్ అధికారులతో కలిసి లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు 50 శాతం నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీలను ఎంపిక చేసి గృహ ప్రవేశాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మొదటి దశ కింద 199 ఇళ్లకుగాను 84 ఇళ్లు పూర్తయ్యాయని, వాటిని ప్రారంభించేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు దాసరి లుముంబా, ఈరన్న, హౌసింగ్ అధికారులు ఈఈ ప్రభాకర్, డీఈ ఆదినారాయణ, విద్యుత్ శాఖ డీఈ సుధాకర్, ఏడీ రామకృష్ణ, ఏఈ నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

హొళగుంద: మండలంలో ఖాళీగా ఉన్న మూడు వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ సోమవారం తెలిపారు. సుకువాయి 7వ వార్డు, చిన్నహ్యోట 9, మద్దిలింగదహళ్లి 3వ వార్డు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ స్థానాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా.. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు, 11న పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న ఉపసంహరణ, అభ్యర్థుల ప్రకటన, 19న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని చెప్పారు.

కొనసాగుతున్న ఓటరు వెరిఫికేషన్ సర్వే

మద్దికెర: చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు బీఎల్‌ఓలు సిఫార్సు చేయాలని తహసీల్దార్ నాగభూషణం సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. మండలంలో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఇంటి యజమానులు, వారి ఇళ్లలో పెళ్లి చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు పోలింగ్‌బూత్ ఆఫీసర్లకు తెలియజేయాలన్నారు. ప్రజాప్రతినిధులు ఓటరు సర్వేకు సహకరించాలని కోరారు.

సీపీఐ మండల కార్యదర్శి ఎన్నిక

హొళగుంద: సీపీఐ మండల కార్యదర్శిగా పెద్దహ్యోటకు చెందిన బోయ మారెప్ప, సహాయ కార్యదర్శిగా రంగన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. ఆస్పరిలో జరిగిన సాధారణ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆధ్వర్యంలో హొళగుంద మండల కమిటీని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ సీపీఐ సిద్ధాంతాలను పాటిస్తూ కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగ, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

కర్ణాటక బస్సుల రద్దుతో ఇబ్బందులు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం బళ్లారి, సిరుగుప్ప డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను సోమవారం ఆయా డిపోల అధికారులు రద్దు చేశారు. దీంతో సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హొళగుందకు బళ్లారి నుంచి రెండు, సిరుగుప్ప డిపో నుంచి ఒక బస్సు రాకపోకలు సాగించేవి. హొళగుంద–మార్లమడికి వరకు 5 కి.మీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో బస్సులు దెబ్బతింటున్నాయని ఆ డిపో మేనేజర్లు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డ్రైవర్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి బస్సుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.